



పెన్షన్ పెంపుపై అవ్వాతాతల ఆనందం

ఒకేసారి రూ.1,000 పెంపుపై హర్షం

- గత ప్రభుత్వం ఐదేళ్లకు రూ.వెయ్యి పెంచడంపై పెదవివిరుపు
- జిల్లా వ్యాప్తంగా 1,27,894 మంది పెన్షన్‌దారులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

పేద వర్గాలకు ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ మొత్తం రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం దీనికి సంబంధించిన ఫైలుపై సంతకం చేయడంతో ఆయా వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీన పెంచిన సొమ్ము నాలుగు వేలు అందుకుంటామని సంతోషంతో చెబుతున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ.రెండు వేలు ఉన్న పింఛన్ జగన్ హయాంలో రూ.మూడు వేలకు చేరుకునేందుకు ఐదేళ్లు పట్టింది.

నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పెన్షన్ సొమ్మును రూ.4 వేలుకు పెంచుతూ సీఎం హోదాలో ఆయన మూడో సంతకం చేయడంపై అవ్వా తాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2014 వరకు కేవలం రూ.200 ఉన్న పెన్షన్‌ను అప్పటి టీడీపీ ప్రభుత్వం తొలుత రూ.వెయ్యి, ఆ తర్వాత రూ.2000 చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రూ. 3వేలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఏడాదికి రూ.250 చొప్పున ఐదేళ్లలో రూ.1,000 పెంచడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన హామీని నెరవేర్చిన చంద్రబాబు

కూటమి అధికారంలోకి వస్తే పెన్షన్ సొమ్మును రూ.3 వేలు నుంచి రూ. 4 వేలు పెంచుతామని ఇచ్చిన హామీని సీఎం హోదాలో చంద్రబాబునాయుడు నెరవేర్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పెన్షన్ పెంపు ఫైలుపై మూడో సంతకం చేశారు. గతం నుంచి పెన్షన్ పెంపుపై సానుకూలంగా ఉన్న టీడీపీ ప్రభుత్వం తాజాగా ఒకేసారి రూ. వెయ్యి పెంచడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో లక్షా 27 వేల 894 మందికి లబ్ధి

పెన్షన్ సొమ్ము రూ.4 వేలు పెంపు వల్ల జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఉన్న లక్షా 27 వేల 894 మంది లబ్ధిదారులకు మేలు జరగనుంది. అలాగే ఈ జిల్లాలో 98 శాతం లబ్ధిదారులు గిరిజనులు కావడం విశేషం. జిల్లాలో జీకేవీధి మండలంలో అత్యధికంగా 7,858 మంది, అత్యల్పంగా మారేడుమిల్లి మండలంలో 2,039 మంది పెన్షన్ లబ్ధిదారులున్నారు. సగటున జిల్లాలో ప్రతి మండలంలో ఐదు వేల మంది పెన్షన్ లబ్ధిదారులున్నారనేది ఒక అంచనా.

జిల్లాలో సామాజిక పెన్షన్ లబ్ధిదారుల వివరాలు

వ.సం	మండలం	పెన్షన్‌దారులు
1.	కూనవరం	4,021
2.	గంగవరం	4,019
3.	రంపచోడవరం	4,649
4.	వీఆర్.పురం	3,766
5.	అరకులోయ	6,630
6.	మారేడుమిల్లి	2,039
7.	హుకుంపేట	7,325
8.	పాడేరు	6,714
9.	కొయ్యూరు	7,802
10.	ఎటపాక	6,195
11.	చింతూరు	5,169
12.	ముంచంగిపుట్టు	6,387
13.	దేవీపట్నం	4,475
14.	అడ్డతీగల	5,565
15.	అనంతగిరి	6,174
16.	వై.రామవరం	3,403
17.	డుంబ్రిగుడ	6,580
18.	పెదబయలు	6,257
19.	రాజవొమ్మంగి	6,594
20.	చింతపల్లి	9,623
21.	జి.మాడుగుల	6,649
22.	జీకేవీధి	7,858
	మొత్తం	1,27,894

చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఎన్నికల ముందు చెప్పినట్టుగా పింఛన్ నగదు రూ.4 వేలు చేస్తూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మర్నాడే సంతకం చేయడం గొప్ప విషయం. మాలాంటి వారికి ఈ పింఛన్ సొమ్ము ఎంతో ఉపయోగపడుతుంది. నడవ లేని స్థితిలో ఉన్న నాకు చంద్రబాబు దయ వల్ల రూ.4 వేలు పింఛన్ రాబోతోంది.

- ఎస్. కాశీ, అరకులోయ

ఎంతో ఆనందంగా ఉంది



పింఛన్ సొమ్మును గత ప్రభుత్వం ఐదేళ్లకు గాని రూ. వెయ్యి పెంచలేదు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మా పెన్షన్ సొమ్మును రూ. 4 వేలుకు పెంచుతూ సంతకం చేయడం చాలా సంతోషంగా ఉంది. నేతలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నప్పుడే ప్రజలకు నమ్మకం, భరోసా కలుగుతుంది. చంద్రబాబునాయుడు అనుకున్నట్టుగా పింఛన్ సొమ్మును పెంచడంతో మాలాంటి వాళ్లకు ఎంతో మేలు జరుగుతుంది.

- సిరగం రంభ, పింఛన్‌దారు, కొర్రా గ్రామం, డుంబ్రిగుడ మండలం

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



మా పింఛన్ సొమ్ము రూ.వెయ్యి పెంచిన చంద్రబాబునాయుడుకు మాలాంటి వాళ్లంతా రుణపడి ఉంటాం. పింఛన్‌సొమ్ముపైనే ఆధారపడి జీవిస్తున్న వారికి ఈ పెంపు ఎంతో ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వం వలే కాకుండా ఒకేసారి రూ.వెయ్యి పెంచడం చాలా సంతోషం. అలాగే పింఛన్ సొమ్మును ఇంటికే పంపించేలా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే వృద్ధులు, వికలాంగులకు ఇబ్బందులు తగ్గుతాయని అనుకుంటున్నాం. ప్రభుత్వం పింఛన్‌దారుల సమస్యలను గుర్తించి అవస్థలకు గురికాకుండా పింఛన్ సొమ్మును పొందేలా చూడాలని కోరుతున్నాం.

- తాంగుల అర్జున్, పెదపాడు గ్రామం, డుంబ్రిగుడ మండలం

మాకు ఎంతో మేలు జరుగుతుంది



ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చుతూ పింఛన్ పెంపుపై సంతకం చేయడం శుభపరిణామం. జగన్మోహన్‌రెడ్డి పింఛన్ నగదు రూ.మూడు వేలు ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చినప్పటికి ప్రతి ఏడాదికి రూ.250 చొప్పున పెంచుకొని వచ్చారు. చంద్రబాబు ఒకేసారి వృద్ధులకు రూ.నాలుగువేలు పింఛన్ పెంచి పింఛన్‌దారులకు భరోసా ఇచ్చారు. పింఛన్ పెంచడం వల్ల నెలకు అవసరమైన మందులు, ఇతర ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చంద్రబాబుకి రుణపడిఉంటాం.

- కిముడు లక్ష్మయ్య, లంబసింగి

అదిరిందయ్యా....చంద్రం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే మాట నిలబెట్టుకున్నవైనం

- మెగా డీఎస్సీకి పచ్చజెండా
- ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు
- పెన్షన్ ఇక నెలకు రూ.4 వేలు
- తెరుచుకోనున్న అన్న క్యాంటీన్లు
- నైపుణ్య గణన షురూ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అన్నట్టే చేశారు. అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అత్యంత ప్రమాదకరమైనదని, దానిని రద్దు చేస్తామన్నారు. ఆ పని కూడా చేసేశారు. రెండో సంతకం దానిపైనే చేశారు. అవ్వ, తాతలకు ప్రస్తుతం నెలకు రూ.3 వేలు వస్తున్న పెన్షన్‌ను జూలై నుంచే రూ.4 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. ఆ ఫైలుపై కూడా సంతం చేసేశారు. పేదలకు నామమాత్రపు ధరకే రుచికరమైన భోజనం పెట్టే అన్న క్యాంటీన్లు మళ్లీ తెరిపిస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన ఫైలుపై నాలుగో సంతకం చేశారు. నిరుద్యోగ యువత ఎంతమంది ఉన్నారో లెక్కించి, వారికి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. దీని కోసం శిక్షణకు అర్హులైన వారిని గుర్తించే (స్కిల్ సెన్సస్) ఫైలుపై ఐదో సంతకం చేశారు. నిరుద్యోగ ఉపాధ్యాయులు, రైతులు, పెన్షనర్లు, పేదలు, నిరుద్యోగ యువతకు మేలు జరిగేలా ఒక్క గురువారమే ఐదు ఫైళ్లపై సంతకం చేసి లక్షలాది మందికి ప్రయోజనం కల్పించారు.

పోలవరం నిర్వాసితుడి ఆత్మహత్యాయత్నంపై సీరియస్

- ఘటనపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్
- చీఫ్ సెక్రటరీ, పునరావాస కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసులు

గోకవరం, జూన్ 13: తూర్పుగోదావరి జిల్లా గోకవరం శివారులోని పోలవరం నిర్వాసితుల కాలనీకి చెందిన ఉన్నమట్ల సీతారామయ్య అనే వృద్ధ నిర్వాసితుడు గత నెల 24వ తేదీన ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. 'ఆంధ్రజ్యోతి', ఇతర మీడియాలలో వచ్చిన కథనాల నేపథ్యంలో రంపచోడవరం న్యాయవాది ఎంవీఆర్ ప్రకాష్ సంబంధిత సంఘటనపై జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన కమిషన్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం పునరావాస కార్యక్రమాల అమలు, నిర్వాసితులకు చేసిన అన్యాయాలను మీడియా కథనాల ద్వారా పరిశీలించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి, పునరావాస కమిషనర్‌కు, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు ఈ నెల 11వ తేదీన నోటీసులు జారీ చేసి సంజాయిషీతో పాటు, సమగ్ర నివేదికను కోరింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి దేవీపట్నం మండలంలోని సుమారు 36 గ్రామాలు భూములు, ఇళ్లు సర్వస్వం కోల్పోయి ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్దేశించిన మార్గదర్శకాల ఆధారంగా రాజమహేంద్రవరం (ధవళే శ్వరం) కేంద్రంగా నడుస్తున్న పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఈ పునరావాస కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు అడ్మిని స్ట్రేటర్‌తో పాటు అనుబంధ అధికారులు నిబంధనల ప్రకారం పోలవరం నిర్వాసితుల భూములకు నష్ట పరిహారాన్ని, పునరావాస ప్యాకేజీని, పునరావాస కాలనీలను సక్రమంగా అమలు చేయకపోవడంతో నిర్వాసితులు కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా చంద్రబాబునాయుడు పాలన అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పునరావాసాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పోలవరం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులు రోడ్డున పడ్డారు. ఈ పరిస్థితిని భరించలేని ఉన్నమట్ల సీతారామయ్య లాంటి నిర్వాసితులు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ తనకు అందిన ఫిర్యాదుపై తక్షణం స్పందించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పునరావాస కమిషనర్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఇచ్చే నివేదికల ఆధారంగా కమిషన్ తదుపరి చర్యలు తీసుకుంటుంది.

మెగా డీఎస్సీపై సంతకం

నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం

- రాష్ట్రవ్యాప్తంగా 16,347 పోస్టులు భర్తీ
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పోస్టుల ఖాళీలపై అధికారుల కసరత్తు
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరిసింది. గత ఏడాది డిసెంబరులో టీచర్ల నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసినా ఎన్నికల ప్రకటనతో మూలపడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సంతకం మెగా డీఎస్సీపై కావడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్రం మొత్తం మీద 16,347 పోస్టులు భర్తీచేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో పోస్టులపై ఇంకా స్పష్టత రావల్సి ఉంది.

ప్రతి ఏడాది జనవరి నెలలో తమ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, ఏడాదంతా ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడుతుందని వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. దీంతో గిరిజన నిరుద్యోగులు తమకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఎంతో ఆశపడ్డారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్పెషల్ డీఎస్సీ గానీ, ఇతర ఉద్యోగాల భర్తీకి గాని ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ ప్రకటిస్తానని చెప్పి అధికారం చేపట్టిన వెంటనే తొలి సంతకం దానిపైనే చేయడంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్లకార్డులతో సీఎంకు అభినందనలు తెలియజేస్తున్న నిరుద్యోగులు

మా ఆశలు నెరవేరబోతున్నాయి



మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో నిరుద్యోగుల ఆశలు నెరవేరుతాయని ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో తీవ్ర నిరాశతో ఉన్నాం. అలాగే ఉపాధ్యాయ పోస్టులకు చర్యలు చేపడుతుందని ఎదురుచూశాం. కానీ ఫలితం దక్కలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేయడం నిరుద్యోగులకు ఎంతో భరోసా ఇచ్చినట్టయింది.

- శెట్టి పరమేశ్వరరావు, బీఎడ్ అభ్యర్థి, డుంబ్రిగుడ

నిరీక్షణ ఫలించింది



బీఎస్సీ, బీఎడ్ పూర్తి చేసినా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నాం. ఇన్నాళ్లకు మా కల నెరవేరబోతున్నదని ఆనందంగా ఉంది. ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం హర్షించదగ్గ విషయం. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని నిరుద్యోగుల మన్ననలు ఆయన పొందుతారు.

- అగతంబిడి విజయకుమారి, బీఎడ్ అభ్యర్థిని, కించుమండ

కొనసాగిన రద్దీ

- మోదకొండమ్మ ఉత్సవాలు ముగియడంతో జనం తిరుగు ప్రయాణం



ప్రయాణికులతో గురువారం రద్దీగా ఉన్న పాడేరు బస్ కాంప్లెక్స్

పాడేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారం ముగియడంతో పాడేరు వచ్చిన జనం తిరుగు ప్రయాణాలు గురువారం కూడా కొనసాగాయి. దీంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో రద్దీ వాతావరణం నెలకొంది. ఈ ఉత్సవాలకు సుమారుగా వారం, పది రోజుల నుంచి వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ఇక్కడికి వచ్చారు. ఈసారి ఉత్సవాలు వాయిదా పడడంతో పాటు గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో అధిక శాతం జనం బుధవారమే తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపారు. దీంతో బస్సులు, కార్లు, జీపుల్లో జనం ప్రయాణాలు సాగించారు. అలాగే స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. గురువారం సైతం ఇదే పరిస్థితి నెలకొంది. అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో పట్టణ రోడ్లన్నీ రద్దీగా మారాయి.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



కుమడలో ఆగిపోయిన బస్సు

ముంచంగిపుట్టు, జూన్ 13: మండలంలో గల మూరుమూల కుమడలో గురువారం పాడేరు ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సు సర్వీసు మొరాయించింది. పాడేరు నుంచి మండల కేంద్రం మీదుగా కుమడ వెళ్లిన ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో కుమడలో మొండికేసింది. బస్సు స్టీరింగ్‌లో సాంకేతికలోపం తలెత్తడం వల్ల బస్సు అక్కడ నుంచి ముందుకు కదల్లేదని తెలిసింది. ఆర్టీసీ డిపో మెకానిక్‌లకు డ్రైవర్ సమాచారం చేరవేశారు. ముంచంగిపుట్టు వచ్చేందుకు కుమడలో ఎక్కిన ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బస్సు ముందుకు కదలకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు. అటుగా తిరిగే ఒకే ఒక్క బస్సు సర్వీసు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పలేదు. మారుమూల ప్రాంతాలకు కండీషన్‌లో ఉండే బస్సులను నడపాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.

గ్రామం ఖాళీ చేయాలని వేధిస్తున్నారు

- ఏపీ జెన్‌కో అధికారులపై పార్వతీనగర్ గ్రామస్థుల ఫిర్యాదు

సీలేరు, జూన్ 13: జీకేవీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలోని పార్వతీనగర్ గ్రామాన్ని ఖాళీ చేయాలంటూ ఏపీ జెన్‌కో అధికారులు తమను వేధిస్తున్నారంటూ ఆ గ్రామానికి చెందిన గిరిజనులు గురువారం స్థానిక సర్పంచ్ దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారికి వినతి పత్రం అందజేశారు. తాము గిరిజన జాతికి చెందిన కోందులమని, తాము గత 15 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతానికి వచ్చి పార్వతీనగర్ గ్రామాన్ని ఏర్పాటు చేసుకుని సీలేరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. 15 సంవత్సరాల క్రితం ఈ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్న సమయంలో కూడా అటవీశాఖ అధికారులు కూడా ఎన్నో ఇబ్బందులకు గురి చేసినప్పటికీ స్థానిక నాయకులు, అప్పటి జీకేవీధి తహసీల్దార్ తమకు అండగా నిలవడంతో ఇప్పటి వరకు ప్రశాంతంగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఏపీ జెన్‌కో అధికారులు వచ్చి ఈ స్థలం వారిదని, ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని, వారు ఇచ్చిన నోటీసులు తీసుకుని ఈ గ్రామం ఖాళీ చేయాలని పదేపదే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. తాము గ్రామం ఏర్పాటు చేసుకున్నప్పుడు గతంలో ఎప్పుడూ ఏపీ జెన్‌కో అధికారులు ఎటువంటి నోటీసులు గానీ, సమాచారం గానీ ఇవ్వలేదని, కొత్త ప్రాజెక్టు నిర్మాణం కోసం తమను ఖాళీ చేయమంటే ఊరుకునేది లేదని గ్రామస్థులు పేర్కొన్నారు.



పార్వతీనగర్ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

క్రైం... crime news

గంజాయి రవాణా కేసులో నిందితులకు పదేళ్ల కారాగార శిక్ష

» రూ.లక్ష జరిమానా

చోడవరం, జూన్ 13: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఇద్దరు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు జడ్జి గురువారం తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన అందించిన వివరాలివి. చీడికాడ మండలం భైలపూడి గ్రామానికి చెందిన జాజిమొగ్గల అప్పారావు, జాజి మొగ్గల అర్జునలు 2015వ సంవత్సరం అక్టోబరు మూడో తేదీ తెల్లవారుజామున రెండు గోనె సంచులతో 32 కిలోల గంజాయిని తరలించేందుకు వారి సొంత గ్రామం భైలపూడి వద్ద వాహనం కోసం ఎదురు చూస్తున్నారు. ఆ సమయంలో అప్పటి చీడికాడ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి నిందితులను ఇద్దరినీ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితులపై నమోదైన కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో గురువారం జిల్లా జడ్జి వారిద్దరికీ పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. లక్ష రూపాయల జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని తీర్పులో వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అడిషనల్ ప్రభుత్వ పీపీ వెంకటరావు వాదనలను సమర్థించిన జడ్జి నిందితులకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, ఈ కేసును సమర్థంగా పర్యవేక్షించడంతో పాటు, సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడడంలో కృషిచేసిన చీడికాడ పోలీసులను, దర్యాప్తు చేసిన అధికారులను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

ఇంటర్‌నెట్ సెంటర్‌లో అగ్నిప్రమాదం



దుకాణంలో వ్యాపించిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎలమంచిలి, జూన్ 13: పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన ఓ ఇంటర్నెట్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రాత్రి 11 గంటల తర్వాత అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. దుకాణ యజమాని వెంకట్రావు బుధవారం రాత్రి ఎప్పటిలాగానే దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. తర్వాత దుకాణంలో మంటలు వస్తున్నాయని ఎవరో ఫోన్ చేయడంతో వెంకటరావు వచ్చారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే జెరాక్స్, లామినేషన్ మిషన్లు, ఫ్రిజ్, ఇతర వస్తు సామగ్రి మంటల్లో కాలిపోయాయి. యజమానికి ఇదే ప్రధాన జీవనాధారం. తనను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన భారీ కంటైనర్

» రహదారిపై తెగిపడిన విద్యుత్ వైర్లు
» ట్రాఫిక్‌కు అంతరాయం... » ఊటగెడ్డ జంక్షన్‌లో ఘటన


రహదారిపై తెగిపడిన విద్యుత్ వైర్లు

పరవాడ, జూన్ 13 : అదుపుతప్పి భారీ కంటైనర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ వైర్లు రహదారిపై తెగిపడ్డాయి. ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారిలోని ఊటగెడ్డ జంక్షన్ వద్ద బుధవారం రాత్రి పదకొండున్నర గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖ పోర్టు నుంచి బుధవారం రాత్రి భారీ కంటైనర్ మిషనరీ సామగ్రితో అచ్యుతాపురం సెజ్‌కు బయలుదేరింది. సరిగ్గా ఊటగెడ్డ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో విద్యుత్ వైర్లు తెగిపడటంతో పాటు స్తంభం ఒక పక్కకు ఒరిగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేకుంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. రహదారిపై వైర్లు తెగిపడడంతో రాకపోకలు సాగించే వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు రంగంలోకి దిగి రహదారిపై తెగిపడిన వైర్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలా ఉంటే విద్యుత్ వైర్లు తెగిపోవడం కారణంగా పరవాడ టీ రాజా హోటల్ నుంచి రావాడ పంచాయతీ పరిధి గ్రామాలన్నింటికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది సుమారు 15 గంటలు పాటు శ్రమించి అనంతరం గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు సరఫరాను పునరుద్ధరించారు. కాగా ప్రమాదానికి కారణమైన భారీ కంటైనర్ లారీ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అన్నవరంలో చోరీ


అన్నవరంలో ఇంట్లో బీరువాలోని వస్తువులు పడేసిన దృశ్యం

కోటవురట్ల, జూన్ 13: మండలంలోని అన్నవరం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి బంగార ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అన్నవరం గ్రామానికి చెందిన పసుపులేటి మంగ తన ఇంటికి తాళం వేసుకుని ఈనెల 8వ తేదీ సాయంత్రం అమ్మగారి ఇంటికి కొడవటిపూడి గ్రామం వెళ్లింది. ఇంట్లో ఎవరు లేరని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక భాగం డోర్ తలుపులు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. బెడ్‌రూంలోని బీరువాను తెరిచి ముదున్నర తులాల బంగార అభణాలు, 12 తులాల వెండి ప్లేటును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ దొంగతనం ఏ రోజు జరిగిదనేది ఎవరికీ తెలియదు. బుధవారం సాయంత్రం మంగ వచ్చేసరికి ఇంటి వెనుక భాగంలో తలుపు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి చూడగా బీరువా తెరిచి బట్టలు చెల్ల చెదారంగా పడి ఉన్నాయి. బీరువాలో వస్తువులు పోయినట్టు గుర్తించింది. బుధవారం రాత్రి 11గంటలకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

హామీల అమలు చరిత్రాత్మకం

చంద్రబాబుపై ప్రశంసల వర్షం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై చేశారు. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై చేశారు. మూడో సంతకం నెలకు నాలుగు వేలు పింఛన్ పెంచిన ఫైల్‌పై చేశారు. నాలుగో సంతకం అన్న క్యాంటిన్లు పునః ప్రారంభంపై చేశారు. ఐదో సంతకం నైపుణ్య గణన ఫైల్‌పై చేశారు. ఈ నిర్ణయాలను జిల్లా ప్రజానీకం స్వాగతించింది. ఇది ప్రజా ప్రభుత్వం అని శ్లాఘిస్తున్నది.

కార్మికులు, బలహీన వర్గాలకు ఎంతో మేలు



తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజే అన్న క్యాంటీన్లు పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం మాలాంటి రిక్షా కార్మికులకు ఎంతో మేలు జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీళ్లను నిలిపివేయడం వల్ల మాలాంటి కార్మికులు, బడుగు, బలహీన వర్గాలకు రూ. 5లకు భోజనం కరువైంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి అన్న క్యాంటీన్లను తెరిచేందుకు చర్యలు తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

- **ఎన్.అప్పారావు**, మార్టూరు, అనకాపల్లి మండలం

అన్న క్యాంటీన్‌లు తిరిగి ప్రారంభిస్తుండడంపై హర్షం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభిస్తామని ప్రకటించడం చారిత్రాత్మకం. లక్షలాది మంది ప్రజలకు రుచికరమైన ఆహారం అందించడం చరిత్రలో నిలిచిపోతుంది. ఏటికొప్పాక నుంచి ఎలమంచిలికి వివిధ పనులపై వెళ్లిన వారంతా అన్న క్యాంటీన్‌ను ఆశ్రయించేవారం. రుచికరంగా ఉండే భోజనాన్ని అందించేవారు. తిరిగి పునః ప్రారంభించడానికి చంద్రబాబు ముందుకు రావడం ఆనందదాయకం.

- **పీలా రమణమ్మ**, గృహిణి, ఏటికొప్పాక

అన్న క్యాంటీన్లు మాకెంతో ఉపయోగకరం



అన్న క్యాంటీన్లు పునరుద్ధరించడం మాకెంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఎందుకంటే నేను రిక్షా కార్మికుడుని. ఉదయం 7 గంటలకు వస్తేనే గాని బేరాలు ఏమీ ఉండవు. అలా వచ్చిన తర్వాత సాయంత్రం వరకు విధి నిర్వహణలో ఉంటాను. ఆ సమయంలో బయటే భోజనం చేసేవాడిని. రోజుకు రూ.200 వరకు తిండి నిమిత్తం ఖర్చు అయ్యేది. ఇప్పుడు 5 రూపాయలు ఖర్చు పెడితే మంచి భోజనం దొరుకుతుంది. మాకెంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- **పూడి రామారావు**, రిక్షా కార్మికుడు, డీబీ కాలనీ, సత్యనారాయణపురం

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో ఉపశమనం



కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడంతో ఉపశమనం కలిగింది. తాతలు, తండ్రుల నాటి ఆస్తులపై నాయకుల ఫొటోలు, పెత్తనాలపై కుటుంబంలో ఆందోళనలు తలెత్తాయి. ఏళ్ల తరబడి కాపాడుకుంటున్న ఆస్తులను పోగొట్టుకోవాల్సి వస్తుందన్న భయాందోళనలను సైతం అలుముకున్నాయి. భవిష్యత్తులో ఆస్తులు అమ్ముకోవాలన్నా, కొనుక్కోవాలన్నా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలన్న వాదన మమ్మల్ని ఎంతగానో కలవరపరిచింది. అయితే టీడీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై తీసుకున్న నిర్ణయంపై మా ఇంటిల్లిపాది ఆనందం వ్యక్తం చేస్తున్నాం.

- **సందిన చినబాబు**, తుమ్మపాల

పింఛన్ రూ.4 వేలకు పెంచడం శుభపరిణామం



తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి నెలా ఇచ్చే సామాజిక పింఛన్ రూ.3 వేలు నుంచి రూ. 4వేలకు పెంచడం శుభపరిణామం. ఎన్నికల్లో ఇచ్చి హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్ రూ. 4వేలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేయడం చాలా ఆనందంగా ఉంది. మాలాంటి వృద్ధులకు ఎంతో సంతోషంగా ఉంటుంది.

- **కశింకోట అప్పారావు**, రజకుడు, అనకాపల్లి.

నిరుద్యోగులకు భరోసా



మెగా డీఎస్‌సీపై సీఎం చంద్రబాబు సంతకం చేయడం నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయంగా భావిస్తున్నాం. ఇంతకాలం వంచనకు గురై జీవితంపై ఆశలు కోల్పోతున్న నిరుద్యోగులకు మెగా డీఎస్‌సీతో భరోసా దక్కినట్టయింది. ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్న మాకు ప్రభుత్వ నిర్ణయం ఆశలు నింపింది. కూటమి ప్రభుత్వానికి మా నిరుద్యోగుల తరపున ధన్యవాదాలు.

- **పుల్లేటి గణేష్**, అధ్యక్షులు, ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, చోడవరం

మా భూమి మాదేనన్న నమ్మకం వచ్చింది



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో మా భూములు మావే అన్న నమ్మకం వచ్చింది. ఇంతకాలం ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో ఉన్నాం. చట్టాన్ని రద్దు చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయంతో మా పిల్లల భవిష్యత్‌పై ఆందోళన తొలగింది. చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం.

- **దేవరపల్లి వెంకట అప్పారావు**, సకురువీధి, చోడవరం

కడుపు నిండా ఆహారం దొరుకుతుంది..



అన్న క్యాంటీన్‌లు మళ్లీ ప్రారంభించడం మాలాంటి చిరు వ్యాపారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రూ. 5లకే రుచికరమైన భోజనం అందించే ఈ మహోత్తర పథకం తిరిగి ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. ఎలమంచిలికి వివిధ పనులపై వచ్చే నాలాంటి చిరు వ్యాపారులకు అన్న క్యాంటీన్‌లు ఎంతో ఉపయోగకరం.

- **కె.నాగేశ్వరరావు**, ధర్మవరం, ఎస్.రాయవరం మండలం

లాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం



వంశపారంపర్యంగా లభించిన భూములు, కొనుగోలు చేసిన భూములపై ముఖ్యమంత్రి ఫొటో ముద్రించడం వల్ల ప్రజల్లో అభద్రతా భావం పెరిగిపోయింది. ఇది చాలా తప్పు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మంచిది కాదు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం కొత్తగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రెండో సంతకం చేయడం చాలా శుభపరిణామం. హర్షణీయం.

- **కర్రి ఆంజనేయులు**, అడ్వకేట్, నక్కపల్లి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల కొరత

» మంజూరైనవి 15 పోస్టులు
» విధులు నిర్వహిస్తున్నది ఆరుగురు మాత్రమే
» కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీల ద్వారా విద్యా బోధన
» ఇబ్బంది పడుతున్న విద్యార్థులు


నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నర్సీపట్నం, జూన్ 13 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల కొరత ఏర్పడింది. డిగ్రీ, పీజీ తరగతులు బోధించేందుకు సరిపడిన సిబ్బంది లేక విద్యార్థుల చదువులు వెనుక బడుతున్నాయి. కోర్సులు మంజూరు చేసినప్పుడు ఎంతమంది సిబ్బంది అవసరమో యూనివర్సిటీ నుంచి ప్రభుత్వానికి నివేదిక వెళుతుంది. అందుకు అనుగుణంగా పోస్టుల భర్తీ జరుగుంది. కానీ ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విషయంలో ఉన్నత విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాలమైన కళాశాల ప్రాంగణం, ల్యాబ్‌లు, తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. సబ్జెక్టులు బోధించేందుకు సిబ్బంది లేక విద్యార్థుల ఉన్నత చదువులు అనుకున్నంతగా ముందుకు సాగడం లేదనే వాదన వినిపిస్తోంది.

గత ఏడాది 260 సీట్లు గాను 234 మంది విద్యార్థులు కళాశాలలో చేరారు. డిగ్రీలో బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు మేజర్ సబ్జెక్టులుగా ఉన్నాయి. అదే విధంగా పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంకాం కోర్సులు ఉన్నాయి. ఈ ఏడాది అదనంగా ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కూడా అందుబాటులోకి రాబోతున్నట్టు సమాచారం. కళాశాలలో పాఠ్యాంశాల బోధనకు అధ్యాపకులు లేక విద్యార్థులు వెనుకబడుతున్నారు. డిగ్రీకి 15 మంది పర్మినెంట్ అధ్యాపకులు అవసరం కాగా ఇంగ్లీషు, తెలుగు, హిస్టరీ, పొలిటిక్స్, ఫిజిక్స్‌కి ఇద్దరు చొప్పున ఆరుగురు ఉన్నారు. కొత్తగా పర్మినెంట్ పోస్టులు భర్తీ చేయలేదు. ఇంగ్లీషు, మ్యాథ్స్ కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులకు ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు కాంట్రాక్ట్ సిబ్బందిని తీసుకున్నారు.

కాంట్రాక్ట్ సిబ్బంది నియామకాలు కూడా ఆపేసి గెస్ట్ ఫ్యాకల్టీతో విద్యాబోధన చేస్తున్నారు. ఈ విధంగా ప్రభుత్వం నియమించిన గెస్ట్ ఫ్యాకల్టీ సిబ్బంది ఎకనామిక్స్‌కు ఒకరు, కామర్స్‌కు ముగ్గురు, లైబ్రేరియన్ ఒకరు ఉన్నారు. ఇంకా సిబ్బంది సరిపోక ప్రిన్సిపాల్ చొరవ తీసుకొని కళాశాల నిధుల నుంచి బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ సిబ్బందిని నియమించుకొని పాఠాలు చెప్పిస్తున్నారు. పీజీ సబ్జెక్టులు కూడా గెస్ట్ ఫ్యాకల్టీ మీద ఆధారపడవల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అయ్యన్నతో అనిత భేటీ


విజయవాడలో అయ్యన్నపాత్రుడికు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి అనిత

కోటవురట్ల, జూన్ 13: మాజీ మంత్రి, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడుతో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత విజయవాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె అయ్యన్నపాత్రుడును సత్కరించి, ఆశీస్సులు తీసుకున్నారు. మంత్రిగా చేపట్టిన అనితకు అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ తన కంటే సీనియర్లు సలహాలు, సూచనలతో విశాఖ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ భేటీలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మంత్రి అనిత తనయుడు పాల్గొన్నారు.

మంత్రి అనితను కలిసిన టీడీపీ నాయకులు



మునగపాక (తుమ్మపాల), జూన్ 13: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేపట్టిన వంగలపూడి అనితను గురువారం తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా దుశ్శాలువాలను కప్పి పూలమాలలతో సత్కరించారు. టీడీపీ బలోపేతానికి సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విజయవాడ దుర్గమ్మ ఆలయంలో మంత్రి అనితకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

ఘనంగా ఎమ్మెల్యే పంచకర్ల జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే పంచకర్లకు కేక్ తినిపిస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రాజు, నేతలు

సబ్బవరం, జూన్ 13 : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలు పెందుర్తిలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పంచకర్లను సత్కరించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు తినిపించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు ఎమ్మెల్యే పంచకర్లకు కేక్ తినిపించారు. జనసేన జిల్లా నాయకులు బలిరెడ్డి అప్పారావు స్వగృహంలో బుధవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే పుట్టిన రోజులు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. వీర మహిళ బంతికోళ్ల పద్మ ఆధ్వర్యంలో పెందుర్తిలోని వృద్ధాశ్రమంలో అన్న సంతర్పణ నిర్వహిం చారు. పుట్టిన రోజు వేడుకల్లో కూటమి నేతలు ఇందలి వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, ఎం. మహాలక్ష్మీనాయుడు, దొడ్డి ప్రకాశ్, కర్రి కనకరాజు, కొటాన అప్పారావు, గొర్లి కుమార్, శరగడం రాము, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, టి. శేఖర్, కేవీ రమణ, అర్జున్, కోటి రవి, దుర్గినాయుడు, బోకం స్వామినాయుడు, గండి దుర్గాప్రసద్, బలిరెడ్డి రామకృష్ణ, గొర్లి రామునాయుడు, రేసుపూడి రమణ, ఆడారి నాగరాజు, శీరం అప్పలరాజు, బర్ల మరణ, గెడ్డం రమేశ్, బలిరెడ్డి ప్రసాద్, ఆకుల గణేశ్, పోతల కనకరాజు, ఉగ్గిన రాము, గొల్ల అర్జున, జెట్ట ప్రసాద్, నెల్లి గోపాల్, కిల్లి సత్యనారాయణ, మామిడి శంకరరావు, కర్రి నరసింగరావు, ఎస్. రవి, సింగంపల్లి శ్రీను ఈ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

జీవీఎంసీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి టౌన్, జూన్ 13: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా ఆమె విద్యార్థుల ప్రార్థనా సమయంలో పాఠశాలకు వచ్చి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ వచ్చింది? లేనిది? ఆరా తీశారు. పాఠశాలకు వచ్చే పాఠ్యపుస్తకాలను విద్యార్థులందరికీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబద్ధతతో పని చేసి విద్యార్థులకు పాఠ్యాంశాలు అందించాలని సూచించారు.

మూలస్వయంభూవరంలో పీసీబీ అధికారుల పర్యటన

» సింహాద్రి కాలుష్యంపై చర్యలు తీసుకుంటామని వెల్లడి


'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్
గ్రామస్థులతో మాట్లాడుతున్న పీసీబీ అధికారులు

పరవాడ, జూన్ 13 : కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరంలో గురువారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు పర్యటించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు కారణంగా తీవ్ర కాలుష్యం వెదజల్లడంతో పాటు గ్రామస్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇదే విషయమై 'వెలుగుల మాటున చీకట్లు' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పీవీ ముకుందరావు, ఏఈ మూర్తి సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. సింహాద్రి కాలుష్యం కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడి నుంచి శాంపిల్స్ సేకరించారు. సింహాద్రి కాలుష్యంపై చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామంలో మోనటరింగ్ మిషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి నోటీసులు ఇస్తామని ఈఈ ముకుందరావు తెలిపారు. అలాగే గ్రామంలో పొలూష్యన్‌కు సంబంధించి సేకరించిన వివరాల నివేదికను 15 రోజుల్లోగా తెలియజేస్తామని వెల్లడించారు. పీసీబీ అధికారుల వెంట స్థానిక నాయకులు కొత్తపల్లి బాబూరావు, కాలపురెడ్డి సురేష్, మరిసా రవి పాల్గొన్నారు.



హుకుంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

» జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ

హుకుంపేట, జూన్ 13 : విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ గుణాత్మక విద్య అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని పాఠశాలను ఆయన సందర్శించారు. తొలి రోజున విద్యార్థులు గణనీయంగా హాజరు కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్య పుస్తకాలకు విద్యార్థులకు అందజేశారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పిల్లల ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వర్‌రావు, హెచ్ఎం సువర్ణ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన గిడ్డి ఈశ్వరి



గుమ్మడి సంధ్యారాణికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణిని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఒకరికి మంత్రి వర్గంలో స్థానం లభించడం ఎంతో సంతోషంగా ఉందని ఈసందర్భంగా గిడ్డి ఈశ్వరి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు ఉన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేపీ నేతలు

పాడేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మంత్రిగా ప్రమాణం చేసిన వై.సత్యకుమార్‌ను బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కె.కృష్ణారావు, కో.కన్వీనర్ జె.ప్రభాకరరావు గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు మన్యంలో దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరామని బీజేపీ నేతలు తెలిపారు.



మంత్రి వై.సత్యకుమార్‌తో బీజేపీ నేతలు కృష్ణారావు, ప్రభాకరరావు

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

జి.మాడుగుల, జూన్ 13 : ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని ఎంఈవో బాబూరావు పడాల్ పేర్కొన్నారు. మండలంలోని గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పరిసర ప్రాంతాలు మంచి వాతావరణంతో ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం పక్కగా మెను పాటించాలన్నారు. అలాగే పుస్తకాలు, బ్యాగులు కిట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఉల్లంఘనలకు పాల్పడితే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంఈవో హెచ్చరించారు.



80 శాతం హాజరు..

మండలంలోని 204 పాఠశాలలు ఉండగా పునఃప్రారంభం నాటికి 80 శాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు. శతశాతం విద్యార్థులు హాజరయ్యే విధంగా హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో తొలి రోజు హాజరు అంతంతే..

పెదబయలు, జూన్ 13 : వేసవి సెలవుల అనంతరం బడులు తెరచుకున్నాయి. అయితే మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో మొదటి రోజు హాజరు అంతంత మాత్రంగానే కనిపించింది. ఏ ఆశ్రమ పాఠశాలలో చూసినా 50 శాతం కూడా విద్యార్థులు హాజరు కాలేదు. పెదబయలులో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర-1లో మొత్తం 246 మందికి విద్యార్థులకు 36 మంది, పెదబయలు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర-2లో మొత్తం 484కి 20 మంది, పెదబయలు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికలు-1లో మొత్తం 398 మందికి 26 మంది, సీతగుంట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికలు-2లో 291 మందికి గాను 25 మంది, అరడకోట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురలో 266 మందికి 35 మంది, సీకరి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురలో 298 మందికి 27 మంది, బొండాపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురలో 150 మందికి 15 మంది, తురకలవలస ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికల పాఠశాలలో 389 మందికి 15 మంది మాత్రమే పాఠశాలలు విద్యార్థులు హాజరయ్యారు.

మొక్కలు నాటిన టీడీపీ శ్రేణులు

కొయ్యూరు, జూన్ 13 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరణ భావితరాలకు ఆదర్శంగా గుర్తుండి పోవాలని తెలుగుదేశం టీడీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జోగేంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా గురువారం చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరణకు గుర్తుగా ఆడాకుల పంచాయతీ కిష్టారం గ్రామంలో మొక్కలు టీడీపీ నేతలు, కార్యకర్తలు నాటారు. సహబంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు బోనంగి సత్య, డౌనూరు సేవమిత్ర దేవి గ్రామ పెద్దలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాగేంద్ర, ఇతర నేతలు

చెరువులో మునిగి అక్కాచెల్లెళ్ల మృతి

అడ్డతీగల, జూన్ 13 : అడ్డతీగల మండలం సోమన్నపాలెంలో అక్కాచెల్లెళ్లు చెరువులో పడి మృతి చెందారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. సోమన్నపాలెం గ్రామానికి చెందిన వంతల కావ్యశ్రీ (13), సాహితి(10) కాలకృత్యాల కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు బుధవారం వెళ్లారు. ప్రమాదవశాత్తూ సాహితీ చెరువులో పడిపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో సోదరి కావ్యశ్రీ కూడా చెరువులోకి జారిపోవడంతో ఇరువురు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించారు.



కావ్యశ్రీ



సాహితి

పశు సంపద పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

» పశువులు, గొర్రెలకు టీకాలు

» జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు

చింతపల్లి, జూన్ 13 : పశు సంపద సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి (డీఏహెచ్‌వో) డాక్టర్ సీహెచ్.నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక ఏరియా పశుసంవర్థకశాఖ ఆస్పత్రిలో కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి మండలాల పశువైద్యులు, ఏహెచ్ఏలు సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో పశుసంపదను అభివృద్ధి చేసేందుకు పశు సంవర్థక సహాయకులు రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే ఐసీఎంఆర్ సూచన మేరకు ఏడాదికి 186 గుడ్లు, 11 కిలోల మాంసం తినాలని, ప్రతి రోజూ 285 గ్రాముల పాలు తాగాలని సూచించారు. పశువులు, గేదెలలో వ్యాధులు నియంత్రించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా టీకాల కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రధానంగా జబ్బవాపు నియంత్రణ కోసం కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో 26,856 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. గొంతువాపు నియంత్రణ కోసం మూడు మండలాల్లో 6,400 నల్ల పశువులకు టీకాలు వేశామన్నారు. అలాగే చిటుక వ్యాధి నివారణ కోసం చింతపల్లిలో 7,054, జీకేవీధి 5,576, కొయ్యూరు 8,800 గొర్రెలు, మేకలకు టీకాలు వేశామన్నారు. పశువులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించేందుకు చింతపల్లి పశుసంవర్థకశాఖ ల్యాబ్‌లో 28 రకాల పరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రధానంగా పేడ, నీరుడు, రక్త పరీక్షలు చేపట్టి సకాలంలో వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో ఆంత్రాక్స్ నివారణకు టీకాలు వేయడం వల్ల ఈవ్యాధి అదుపులో ఉన్నదన్నారు. పశుబీమా పథకం నమోదు చేసుకున్న 176పశువులు మరణించగా 146 పశువులకు రూ.ఐదు నుంచి 15 వేల బీమా నగదు అందించడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో ఆర్గానిక్ మాంసాహారం ఉత్పత్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని జంతువులను హింసించడం చట్టరీత్యా నేరమని, కేవలం వధశాలల్లో నిబంధనల ప్రకారం జంతువులను వధించాలన్నారు. జంతువులను రవాణా, హించించడం చేస్తే 1977జంతు సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జంతు హింసను పూర్తి స్థాయిలో నివారించేందుకు జిల్లా స్థాయిలో ఎస్పీసీఏ కమిటీని నియమించామన్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వివిధశాఖల ఉద్యోగులు సభ్యులు కమిటీలో ఉన్నారన్నారు. జంతవుల తరలింపును నియంత్రించేందుకు ప్రధాన కేంద్రాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. రవాణ చేస్తూ పట్టుబడిన పశువులను సంరక్షించేందుకు రూ.50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గోశాలలు నిర్మిస్తున్నామన్నారు. పశువైద్యులు, పశుసంవర్ధక సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికి అందుబాటులోవున్న సిబ్బందితో పాడి రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. పాడి రైతులు పశుసంవర్థక సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో చింతపల్లి పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, మూడు మండలాల పశువైద్యాధికారులు దుర్గా ప్రసాద్, రాజశేఖర్, దేశగిరి ధమయంతి, చల్లంగి చాలిని, ప్రసన్న స్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఏహెచ్‌వో డాక్టర్ నరసింహులు

కాలువ నిర్వహణపై నిర్లక్ష్యమేల?

సీలేరు మేజర్ పంచాయతీ వాసుల ఆవేదన అసంతృప్తి

సీలేరు, జూన్ 13 : జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీలో కాలువ సదుపాయం లేకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇళ్లల్లో వినియోగించే నీరుబయటకు పోయేందుకు కాలువ (డ్రైనేజీ)లను నిర్మించకపోవడంతో ఎక్కడ నీరు అక్కడ నిల్వ ఉండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో విపరీతంగా దోమలు పెరిగిపోతున్నాయి. స్థానిక పంచాయతీ పాలకవర్గం దృష్టికి మురుగునీటి కాలువను నిర్మించాలంటూ ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మేజర్ పంచాయతీలోని స్థానిక మార్కెట్ రోడ్డు, 9వ క్రాస్ రోడ్డు (ఎక్స్‌టెన్షన్ రోడ్డు) ఇళ్ళ వెనుక భాగంలో గల మురుగు నీటి కాలువ నిర్మించి 35 సంవత్సరాలకు పైబడడంతో కాలువ ఎక్కడికక్కడ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ పరిధిలోని ఇళ్లల్లో వాడకం నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. గత రెండేళ్ళ క్రితం వరకు ఈ కాలువను పంచాయతీ వారు నెలకు ఒకసారి అయినా శుభ్రం చేస్తూ కాలువలో ఉండే చెత్తాచెదారంను తొలగించేవారు. ఈ కాలువ ఉన్న వీధిలోనే ఒక ఎంపీటీసీ సభ్యుడు, ఇద్దరు పంచాయతీ వార్డు సభ్యులు ఉన్నప్పటికీ వారి ఇంటి వెనుక భాగంలోనే శిథిలావస్థకు చేరుకున్న కాలువపై దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీరు ఇక ఇతర సమస్యలు ఏం తీరుస్తారని స్థానిక సీఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె సుభాన్ విమర్శించారు.ఈ కాలువను నిర్మించాలంటూ పలుమార్లు తీర్మానాలు చేసినప్పటికీ కార్యరూపం దాల్చడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార్లు స్పందించి సీలేరు మార్కెట్ రోడ్డు వెనుక ఉన్న కాలువను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



కాలువ పాడుబడడంతో పెరిగిన పిచ్చి మొక్కలు

తగ్గిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తుండంతో ఏజెన్సీలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత రెండు వారాల వరకు ఏజెన్సీలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీలు వరకు ఉండేవి. కాని గురువారం ఏజెన్సీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 29.5 డిగ్రీల సెల్సియస్‌కు మించలేదు. గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో రోహిణి కార్తెలు సైతం ముగియడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ఎండల తీవ్రత తగ్గుముఖం పడుతున్నది. గురువారం పాడేరులో 29.5. అరకులోయలో 26.1, చింతపల్లిలో 29.5, ముంచంగిపుట్టులో 27.6, హుకుంపేటలో 27.7, పెదబయలులో 26.6, జి.మాడుగులలో 27.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నైరుతి రుతుపవనాలు మరింతగా బలపడితే వాతావరణంలోని మార్పులతో ఉష్ణోగ్రతలు పూర్తిగా తగ్గే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ పేర్కొంటున్నది. దీంతో ఇన్నాళ్లూ ఎండ తాకిడికి ఇబ్బంది పడిన ప్రజలు కాస్త ఊరట చెందుతున్నారు.

గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డీఎస్సీ

» ఏపీ గిరిజన సంఘం డిమాండ్

అరకులోయ, జూన్ 13 : అధికార బాధ్యతలు చేపట్టగానే చంద్రబాబు నాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లో సురేంద్ర, లోతా రాంబాబు, అల్లూరి జిల్లా ఏపీ గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గిరిజన్‌భవన్‌లో వేర్వేరుగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంత నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 39 వేలు ఖాళీ పోస్టులు ఉన్నాయన్నారు. కేవలం 16,350 పోస్టులతో నిరుద్యోగులకు న్యాయం జరదన్నారు. 39 వేల పోస్టుల భర్తీతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అరకులోయ ఎన్నికల పర్యటనకు విచ్చేసిన చంద్రబాబు గిరిజన ప్రాంతంలో నూటికి నూరుశాతం ఉద్యోగాలు గిరిజన నిరుద్యోగ యువతీ యువకులతోనే భర్తీ చేయాలంటే జీవో నెంబర్-3ని పునరుద్ధరిస్తామని సభాముఖంగా ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు గిరిజన ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా జీవో నెంబర్-3కి చట్టబద్దత కల్పించేలా పునరుద్ధరించాలన్నారు. చంద్రబాబు గిరిజన యువతకు ఎన్నికల ప్రచార సభలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బాలదేవ్‌తో పాటు జిల్లా నాయకులు దర్మాన పడాల్, చిన బాబు, కొండలరావు, సురేశ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్

వేగవంతంగా అభివృద్ధి పనులు

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ఆదేశం

డుంబ్రిగుడ, జూన్ 13 : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అదేశించారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా రూ.1 కోటి 80 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని గురువారం ఆయన పరిశీలించారు. మండలంలోని కోర్రాయి పంచాయతీ బరియాకులవలస గ్రామంలో రూ.అరవై లక్షలు, బురిడివలసలో అరవై లక్షలు, గోలంబో గ్రామంలో అరవై లక్షలు. వ్యయంతో నిర్మింస్తున్న మల్టీ పర్పస్ సెంటర్ల పనులు పురోగతిని ఆయన పరిశీలించారు. నిర్మాణం పనులు పటిష్టమైన నాణ్యతలను పాటించాలని కాంట్రాక్టర్లను అదేశించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. నిర్మాణంలోని నాణ్యతల విషయంలో ఎక్కడ రాజీ పడొద్దని స్పష్టమైన అదేశాలు చేశారు. నాణ్యత ప్రమాణాలు ఎక్కడ లోపించిన ఉపేక్షించేది లేదని అయన హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.



మల్టీ పర్పస్ సెంటర్ల పనులు పరిశీలిస్తున్న పీవో అభిషేక్

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమే

వైద్యాధికారి మణికంఠ

చింతపల్లి, జూన్ 13 : క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నివారణ సాధ్యమేనని గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వైద్యాధికారి మణికంఠ అన్నారు. గురువారం చౌడుపల్లి గ్రామసచివాలయంలో జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 226 మంది రోగులకు సాధారణ, క్యాన్సర్ నిర్ధారణ తనిఖీలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు అల్ట్రాసౌండ్, గర్భాశయ స్కానింగ్‌లు నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కేన్సర్ లక్షణాలను ప్రజలు సకాలంలో గుర్తించడంలో విఫలమవుతున్నారన్నారు. సకాలంలో క్యాన్సర్‌ని గుర్తించకపోవడం వల్ల వ్యాధి తీవ్రత పెరిగి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రధానంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు కనిపిస్తున్నాయన్నారు. పొగాకు వల్ల నోటి క్యాన్సర్ వస్తుందన్నారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యాధికారిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్రెల ఎంపీహెచ్‌ఈవోలు బాలయ్య, రామకృష్ణ, హెచ్‌వీ సీతాదేవి, పారామెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మణికంఠ

దోమ తెరల సరఫరాకు ప్రతిపాదనలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమీల్ బాషా

కొయ్యూరు, జూన్ 13 : మలేరియా కారక దోమల నుంచి రక్షణకు వీలుగా దోమతెరలు సరఫరాకు వీలుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమీల్ బాషా తెలిపారు.గురువారం సాయంత్రం డీఎంహెచ్‌వోరాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టామన్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు వెయ్యి మందికి మలేరియా పాజిటివ్ వచ్చిందన్నారు. మలేరియా కేసులు నమోదైన ప్రాంతాలలో ఇప్పటికే స్ప్రేయింగ్ పూర్తి చేశామన్నారు. అలాగే మలేరియా కారక దోమల నిర్మూలన చర్యలు తీసుకున్నామన్నారు. అంతేకాకుండా దోమల వల్ల ఎవ్వరికీ హాని కలగకూడదనే ఉద్దేశంతో దోమ తెరల సరఫరాకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న 78 మంది హెల్త్ అసిస్టెంటులకు సర్వీసు రెగ్యులరైజ్ చేయటం జరిగిందన్నారు. 1139 మందికి సికిల్‌సెల్ ఎనీమియా పాజిటివ్ ఉన్నట్టు ఇటీవల జరిపిన పరీక్షలలో గుర్తించామన్నారు. వారిలో 900 మందికి ఇప్పటికే పెన్షన్ ఇస్తున్నామని మిగిలిన వారికి త్వరలో పంపిణీకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మనోజ్ఞ, సంపత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమీల్ బాషా

సంక్షిప్తంగా..

18న మాడుగులమ్మ పండుగ

జి.మాడుగుల, జూన్ 13 : స్థానిక మత్స్యమాడుగులమ్మ పండుగ ఈ నెల 18న మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు ఎం.రామరాజు, గిరి తెలిపారు. అమ్మవారి ఉత్సవాలు మూడు రోజులు నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో అప్పట్లో వాయిదా వేసినట్టు తెలిపారు.. దీంతో మంగళవారం ఒక్కరోజు మాత్రమే పండుగ నిర్వహించి అమ్మవారి ఘటాలు, శతకం మొక్కులు నిర్వహిస్తున్నట్టు భక్తులు గమనించాలని వారు విజ్ఞప్తి చేశారు.

సీకరి ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పెదబయలు, జూన్ 13 : మండలంలో గల సీకరి పంచాయతీ కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల గల ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంపూరు చలపతిరావు ప్రకటనలో తెలిపారు. 3వ తరగతికి 40, 4వ తరగతికి 12, 5వ తరగతికి 21, 7, 9, 10 తరగతులకు 9 మంది సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాలకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం : 94408 31009 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

గాంధీనగర్ పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జి.మాడుగుల, జూన్ 13 : స్థానిక గాంధీనగర్ బాలికలు ఆశ్రమ పాఠశాలలో ఖాళీలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తునట్లు హెచ్ఎం పి.సుభద్రమ్మ తెలిపారు. ఈ ఏడాదిలో నాలుగు, పదో తరగతిలో ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు నేరుగా తమ పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవచ్చునని హెచ్ఎం కోరారు.

కొత్తూరు బాలురు-1 పాఠశాలలో...

స్థానిక కొత్తూరు ఆశ్రమ బాలురు-1లో ఖాళీలు భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని హెచ్ఎం బాలరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 3వ తరగతిలో 80 ఖాళీలు, 4వ తరగతి 76, 5వ తరగతి 54, 7వ తరగతి 05, 8వ తరగతి 03, 9వ తరగతిలో 10 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు నమోదు చేసుకోవాలని హెచ్ఎం కోరారు.

గిరిజన స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి : సీపీఎం

పాడేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన నేపథ్యంలో గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స గురువారం ఒక ప్రకటనలో కోరారు.

జీవో.3 రద్దు నేపథ్యంలో మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులను సాధారణంగా భర్తీ చేస్తే గిరిజన అభ్యర్థులు నష్టపోతారన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన అభ్యర్థులకు అక్కడ పోస్టుల్లో శత శాతం నియామకాలు చేపట్టేలా టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. జగన్ ప్రభుత్వం గిరిజన నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, టీడీపీ ప్రభుత్వం వారికి న్యాయం చేయాలన్నారు.

హామీలు నిలబెట్టుకున్న ఎన్డీయే ప్రభుత్వం

పాడేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నిలబెట్టుకున్నదని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్యకొండబాబు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ చట్టం, పెన్షన్ పెంపు, అన్నా క్యాంటీన్లు, నైపుణ్య గణన ఫైళ్లపై వరుసగా సంతకాలు చేయడం విశేషమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని ప్రజలకు సంపూర్ణమైన న్యాయం జరుగుతుందని కొండబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.